మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన నేతలు



శంషాబాద్: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేదర్, శంషాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్ యాదవ్‌లు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఐటీ దాని అనుబంధ పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకోవాలని కోరారు.

స్పీకర్‌కు నేతల సన్మానం



గడ్డం ప్రసాద్ కుమార్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

రాజేంద్రనగర్: రాష్ట్ర శాసన సభ అధ్యక్షులు గడ్డం ప్రసాద్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను శుక్రవారం టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మ్యాడం రామేశ్వర్ రావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రామేశ్వరమ్ నరేందర్ మాదిగతో పాటు వనం నర్సింహా మాదిగ, సింగ దాసరి నరేశ్ మాదిగ, ప్రేమ్ కుమార్ మాదిగ, సనివెల్లి చంద్రశేఖర్ రెడ్డి, ఆనంద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఇబ్బందులు లేకుండా చూడాలి



జలమండలి అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు మంచినీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. జానవి ఎన్‌క్లేవ్‌లోని మేయర్ మహేందర్‌గౌడ్ కార్యాలయంలో జలమండలి జనరల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, మేనేజర్ నరేందర్‌లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జలమండలికి సంబంధించిన పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచినీటి పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రతి ఇంటికి మంచినీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గణిత శాస్త్ర దినోత్సవం

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థుల మేధస్సును గుర్తించడం ప్రదర్శనల ద్వారా బయటపడుతుందని శ్రీ గాయత్రి ఇ-టెక్నో పాఠశాల చైర్మన్ కొంపల్లి మధుసూదన్ అన్నారు. శుక్రవారం మధుబన్ కాలనీలోని శ్రీ గాయత్రి ఇ-టెక్నో పాఠశాలలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత దేశానికి చెందిన మహా మేధావి రామానుజన్ జయంతిని పురస్కరించుకొని పాఠశాలలో గణిత శాస్త్ర ప్రదర్శనను నిర్వహించారు.

ఆటోడ్రైవర్ల ఉపాధి కాపాడండి



డీఆర్‌ఓ సంగీతకు వినతి పత్రం అందజేస్తున్న ఆటోకార్మికులు

శంషాబాద్: ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణంతో వేలాది మంది ఆటోకార్మికులు రోడ్డున పడుతున్నారని బీఎంఎస్ ఆటో, ట్యాక్సీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా అన్నారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓ సంగీతకు వినతి పత్రం అందజేశారు. ఉచిత ప్రయాణంతో జీవనోపాధి కరువైందన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎండీ సయ్యదుద్దీన్, శ్రీనివాస్, నరసింహాగౌడ్, జగదీష్ తదితరులున్నారు.

బోటిగూడను పంచాయతీగా ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బోటిగూడ వాసులు

శంషాబాద్ రూరల్: మండలంలోని బోటిగూడ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానికులు శుక్రవారం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌కు విన్నవించారు. రామంజాపూర్ పంచాయతీ అనుబంధ గ్రామంగా ఉన్న బోటిగూడలో 500 జనాభా ఉన్నారని, ఈ గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో ఇబ్బందులు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు బిక్షపతి, సురేష్, యాదగిరి, శ్రీకాంత్, మోహన్, నర్సింహా, శంకర్, శ్రీను, యాదయ్య, బాల్‌రాజ్, స్వామి పాల్గొన్నారు.

సభ్యులపై సస్పెన్షన్ తొలగించాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ నేతల ఆందోళన

శంషాబాద్: పార్లమెంటు సభ్యుల సస్పెన్షన్‌లు వెంటనే ఎత్తివేయాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర సర్కారుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంటు శీతాకాలం సమావేశాల్లో అంగతకుల అలజడిపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేని ఎన్‌డీఏ సర్కారు ప్రతిపక్షాల సభ్యులను సస్పెన్షన్ చేసిందన్నారు. కేంద్ర సర్కార ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు పాలమాకుల జంగయ్య, జైపాల్‌రెడ్డి, పుస్తకాల నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నైపుణ్య శిక్షణపై అవగాహన ఒప్పందం



శంషాబాద్ రూరల్: మండలంలోని కాచారం శివారులో ఉన్న వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఉపాధి నైపుణ్య శిక్షణపై అవగాహన ఒప్పందం చేసుకున్నారు. విశాఖపట్నానికి చెందిన సీఎస్‌సీ అకాడమీ, వర్ధమాన్ కాలేజీ మధ్య ఈ ఒప్పందం జరిగింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతికపై సి-డాక్ మరియు ఐఈఈఈతో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జేవీఆర్ రవీంద్ర తెలిపారు.

తగ్గిన రైళ్లు.. పెరిగిన ఇక్కట్లు

ఎంఎంటీఎస్ రైల్ సర్వీసుల కుదింపు

- లింగంపల్లి నుంచి 102 సర్వీసుల నుంచి 66 సర్వీసులకు కుదింపు
- ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు సర్వీసుల నిలిపివేత







శేరిలింగంపల్లి: పేద, మధ్యతరగతి, అన్నిరకాల ఉద్యోగవర్గాలవారికి ఎంతో ఉపయుక్తంగా ఉండే ఎంఎంటీఎస్ రైల్ల సంఖ్య తగ్గిపోయింది. దీంతో అక్టోబర్ మాసం నుంచి ప్రయాణికులు నిత్యం అవస్థల పాలవుతున్నారు. ప్రత్యామ్నాయంగా బస్సులు, ఆటోలపై ఆధారపడుతూ ఎక్కువ చార్జీలు పెట్టి రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ఏడాది నుంచి ఎంఎంటీఎస్ రైళ్ళను పెంచాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

ఉదయం, సాయంత్రమే రైళ్ళు

- లింగంపల్లి నుంచి హైదరాబాద్‌కు ఎంఎంటీఎస్ సర్వీసులు తెల్లవారుజాము నుంచి ఉదయం 9.15 వరకు నడుస్తున్నాయి. ఆ తర్వాత మళ్లీ సాయంత్రం 4.10కి ఈ రైళ్లు ప్రారంభమవుతున్నాయి. దీంతో ఈ మధ్య సమయంలో ఎలాంటి రైళ్ళను నడపడం లేదు
- అలాగే లింగంపల్లి నుంచి ఫలక్‌నామా వైపు రైళ్ళు తెల్లవారుజాము నుంచి ఉదయం 10.05 గంటల వరకు ఆతర్వాత మళ్ళీ సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమవుతూ రాత్రి వరకు సాగిస్తున్నారు. దీంతో మధ్య సమయంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోతున్నారు.

102 నుంచి 66 సర్వీసులకు కుదింపు

- ఎంఎంటీఎస్ రైళ్ళను లింగంపల్లి నుంచి సికింద్రాబాదు, ఫలక్‌నామా, ఉందానగర్, మేడ్చల్, హైదరాబాద్ వరకు ప్రతి నిత్యం నడిపిస్తున్నారు.
- సెప్టెంబర్ 30 వరకు రోజూ 102 సర్వీసులను అప్ అండ్ డౌన్ రైళ్లను నడిపేవారు. దీంతో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేది.
- కానీ ఈ ఎంఎంటీఎస్ సర్వీసులను అక్టోబర్ 1 నుంచి ట్రాక్ మెయింటెనెన్స్ పేరిట 66 సర్వీసులకు కుదించారు. దీంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతూ ప్రత్నామ్యాయ రవాణా సౌకర్యం చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యంపై దృష్టి

- ఎంఎంటీఎస్ రైళ్ళ సంఖ్య తగ్గిపోవడంతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.
- ముఖ్యంగా చిరువ్యాపారులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, ఐటీ ఉద్యోగులు కూడా ఈ రైళ్లనే నమ్ముకొని రాకపోకలు సాగిస్తుంటారు.
- ఐటీ ఉద్యోగులు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి లింగంపల్లి, హఫీజ్‌పేట్, హైటెక్ సిటీ తదితర ఎంఎంటీఎస్ ద్వారా రాగా వారిని రైల్వే స్టేషన్ నుంచి ఐటీ సంస్థ వరకు ఆయా సంస్థకు చెందిన వాహనాల్లో తీసుకెళ్ళడం జరుగుతోంది.
- అంతేకాకుండా ఉద్యోగులు, ఇతర చిరువ్యాపారులు, ఇతరులు కూడా రాకపోకలు సాగిస్తూ ఉంటారు.
- ముఖ్యంగా తక్కువ చార్జీలతో రాకపోకలు సాగిస్తుండడంతో అందరికీ ఎంతో ఈ రైళ్ళు ఎంతో ఉపయుక్తంగా మారాయి. కానీ సర్వీసులు తగ్గించడంతో పది రూపాయలతో రాకపోకలు సాగించే వారు ఇతర వాహనాలను ఆశ్రయించి మూడు, నాల్గింతల చార్జీలు చెల్లించి రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు.

మంత్రిని ఆశీర్వదించిన చినజీయర్ స్వామి



శంషాబాద్ రూరల్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శుక్రవారం శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న శ్రీరామనగరంలో జీయర్ స్వామిని కలిశారు.

ప్రభుత్వ పాఠశాలలో గణిత మేళా



శంషాబాద్: గణిత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో గణిత మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణితానికి సంబంధించిన పలు ప్రదర్శనలు చేపట్టారు. విద్యాకమిటీ చైర్మన్ అక్రమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉండాలి

మంత్రి సీతక్క



ప్రారంభ కార్యక్రమంలో మంత్రి సీతక్క, విమలమ్మ తదితరులు

మణికొండ: సమాజంలో ఆర్థికంగా వెనకబడి పేదలుగా బతుకుతున్న వారికి సేవా సంస్థలు తమ వంతు అండగా నిలవాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని ఓం కన్వెన్షన్‌లో ఆపిల్‌హోం రియల్ నీడ్ ఇండియా ఫౌండేషన్ వారు పేద విద్యార్థినులకు లో దుస్తులు అందించే కార్యక్రమంలో ఆమె శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన దేశం, గ్రామాలలో చాలా మంది పేదలకు దుస్తుల కొరత ఉందన్నారు. పేద బాలికల అవసరాలను తీర్చడంలో ఆపిల్ హోం రియల్ నీడ్ ఇండియా ఫౌండేషన్ వారు చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. క్రిస్మస్ కార్నివాల్‌లో బాగంగా శనివారం అభిజీత్ దేశ్‌పాండే స్టాండ్ ఆప్ కామెడి, మహిళల డీజే ప్లూజా ప్రత్యక్ష ప్రదర్శనలు, శాంతా క్లాజ్ ఫోటో బూత్, టాప్ బ్రాండ్ల షాపింగ్ స్టాల్‌లు, కేక్ మిక్స్ వేడుకతో పాటు గ్రాండ్ డిన్నర్, లైవ్ మ్యూజిక్ బ్యాండ్‌లు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. పలువురు సినిమా తారలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సోదరి విమలమ్మ, ఫౌండేషన్ నిర్వాహకురాలు డాక్టర్ నీలిమ ఆర్యలతో పాటు సభ్యులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు నేతల శుభాకాంక్షలు



మణికొండ: గిరిజన బిడ్డ, తెలంగాణ ఉక్కు మహిళగా పేరుగాంచి ఇటీవల రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న సీతక్కను ఎంఆర్‌పీఎస్ నాయకులు శుక్రవారం ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఆధ్వర్యంలో గిరిజనులతో పాటు ఎస్సీలకు న్యాయం చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు వనం నర్సింహామాదిగ, జిల్లా మాజీ అధ్యక్షుడు నరేందర్‌మాదిగ, నాయకులు నరేష్‌మాదిగ, ప్రభాకర్ మాదిగ, రామేశ్వర్‌రావు ఉన్నారు.

గణితంలో పట్టు సాధించాలి



గణిత ప్రదర్శనను తిలకిస్తున్న నరేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డిలు

మణికొండ: గణితం సబ్జెక్టు అంటే ఎక్కువ మంది విద్యార్థులకు అర్థం కాక భయం కలుగుతుందని, అది వీడి దానిపై ఉపాధ్యాయుల సలహాతో పట్టు సాధించాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మెన్ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గణిత దినోత్సవం సందర్భంగా మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన గణిత ప్రదర్శనను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గణితంలో రాణించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. మున్సిపల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ పాల్గొన్నారు.

సీబీఐటీలో గణిత దినోత్సవం



మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో శుక్రవారం రామానుజం గణిత క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉస్మానియా యూనివర్శిటీ ప్రొఫెసర్ వి.శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణిత పితామహుడు డాక్టర్ రామానుజం రాసిన వివిధ గణిత సూత్రాలు ప్రపంచ మేదావులను ఆలోచింపచేశాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, కళాశాల స్టూడెంట్ అఫైర్స్, ప్రొగ్రెషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీవీఆర్ రవీందర్‌రెడ్డి ప్రసంగించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మండల పరిధి బుద్వేల్‌లోని గేట్‌వే ఇంటర్నేషనల్ హై స్కూల్ ఆవరణలో వినూత్న రీతిలో క్రిస్మస్ సంబరాలు అంబరాన్ని తాకే విధంగా ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి పలువురిని విశేషంగా ఆకట్టుకున్నారు. పాఠశాల యజమాన్యం మామిడి వీరమణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరితా మానెతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





ఎయిర్‌పోర్టులో క్రిస్మస్ అలంకరణ



శంషాబాద్: క్రిస్మస్ వేడుకల సందర్భంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. విలేజ్ టెర్మినల్ ప్రాంతంలో క్రిస్మస్ ట్రీ.. శాంతాక్లాజ్ బొమ్మలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక అలకరణలను కాస్తా ప్రయాణికులకు క్రిస్మస్ వేడుకలకు వెల్‌కమ్ చెబుతున్నాయి.

రాష్ట్రస్థాయి చదరంగ పోటీలకు అత్తాపూర్ విద్యార్థి

అత్తాపూర్: రాష్ట్రస్థాయిలో జరిగిన చదరంగ పోటీల్లో అత్తాపూర్ జిల్లా పరిషత్ హై స్కూల్ (జడ్‌పీహెచ్‌ఎస్) పాఠశాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న జి.నివంసిక ఎస్‌జీఎఫ్ అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయిలో గెలుపొంది జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కె.శ్రీలత తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఇక ముందు మరిన్ని విజయాలు సాధించాలని అభినందించారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాలు సిద్ధం

మణికొండ: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని గండిపేట మండల పరిధిలోని వైష్ణవాలయాలు సిద్ధమయ్యాయి. శనివారం ఉదయం 5 గంటల నుంచే భక్తులకు ఉత్తర ద్వారం ద్వార స్వామి వార్ల దర్శనాలు కలిగించేందుకు ఆలయ కమిటీల వారు ఏర్పాట్లు పూర్తి చేశారు. నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవులలోని శ్రీవేణుగోపాల స్వామి, మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని గోల్డెన్ టెంపుల్, శ్రీలక్ష్మీ నరసింహాస్వామి, ఓయూ కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయాలలో ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వార్లను దర్శనం చేసుకునేందుకు వస్తుండటంతో వారికి త్వరగా దర్శనం కలిగేలా క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి వరకు ఉత్తర ద్వార దర్శనం కొనసాగుతుందని, భక్తులు తమ వీలును బట్టి రావాలని ఆయా దేవాలయాల కమిటీ నాయకులు తెలిపారు.

రాజేంద్రనగర్: ఈ నెల 23వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా రాజేంద్రనగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని శుభ్రపరిచినట్లు దేవాలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. రాజేంద్రనగర్ దేవాలయంలో ఉత్తర ద్వారం ఉన్నందున ఈ రోజు దక్షిణాయనం ముగించుకొని రేపటి నుంచి ఉత్తరాయణం మొదలవుతుందని.. అందుకే ఉత్తర వైకుంఠ ఏకాదశి లేదా వైకుంఠ ఏకాదశి అని పిలుస్తారన్నారు. ఉదయం 5 గంటల నుంచి నుండి సుప్రభావత సేవతో స్వామి వారి ఆలయం ఉత్తర ద్వారం నుండి దర్శనాలు మొదలై రాత్రి వరకు వేలాది మంది భక్తులు దర్శనం చేసుకొని తరిస్తారన్నారు.

అయ్యప్ప మహా పడిపూజ



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ హరిహర క్షేత్రం శ్రీ అయ్యప్ప దేవాలయం నూతనంగా నిర్మించిన ఈ దేవాలయంలో మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమం బి.బాలరాజ్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. భజన మండలి నార్సింగి నర్సింగ్ రావు ఈ పూజ కార్యక్రమం శివనరసింహా తాంత్రి కేరళ వారి కర్ర కమలచే ఈ పూజ కార్యక్రమం నిర్వహించారు.

ఆలయ భూమినీ వదలరా?

స్థానికుల ఆందోళన



దేవాయలం వద్ద పనులను నిలిపివేయించిన నార్సింగి వాసులు

మణికొండ: చారిత్రాత్మక హనుమాన్ దేవాలయం భూమిని పక్క భూమి యజమాని కబ్జాకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ స్థానికులు ఆందోళనకు దిగారు. పనులను అడ్డుకోవటంతో పాటు అతను ఏర్పాటు చేసుకున్న బోర్డులను తుడిచి వేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని రెండు వర్గాలను స్టేషన్‌కు తీసుకుని వెళ్లి ఫిర్యాదులు తీసుకుని సదరు భూమిని సర్వే చేయాలని రెవెన్యూ అధికారులకు లేఖ రాశారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో పోసారం హనుమాన్ దేవాలయం పేరుతో 6.17ఎకరాల భూమి ఉంది. దాని పక్కనే ఓ న్యాయవాదికి 7.30 ఎకరాల భూమి ఉంది. దేవాలయం వెనకవైపు ఉన్న చెట్లు, రాళ్లను తొలగించి చదును చేసే పనులను గురువారం రాత్రి చేపట్టారు. విషయం తెలుసుకున్న నార్సింగి, ఖానాపూర్, మంచిరేవుల తదితర గ్రామాలకు చెందిన భక్తులు శుక్రవారం దేవాలయం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. పనులను అడ్డుకుని జేసీబీలను పంపివేశారు. విషయం తెలుసుకున్న నార్సింగి పోలీసులు అక్కడకు చేరుకుని పనులను నిలిపివేసి ఇరు వర్గాలను స్టేషన్‌కు తరలించారు.

సర్వే చేసే వరకు పనులు చేయొద్దు...

నార్సింగిలో వివాదంగా మారిన హనుమాన్ దేవాలయం భూమిలో ప్రభుత్వ పరంగా సర్వే చేసి హద్దులు నిర్ణయించే వరకు ఎవరూ పనులు చేయవద్దని నార్సింగి ఇన్‌స్పెక్టర్ శివకుమార్ ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, నాయకులు రాము, గండయ్య, వేణుగౌడ్, వినోద్‌కుమార్, వెంకటేష్, బీజేపీ నాయకులు కృష్ణ, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎంపీలను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికం

బండ్లగూడ: పార్లమెంట్‌లో ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అని సీపీఎం గండిపేట మండల కన్వీనర్ జాజుల రుద్రకుమార్ అన్నారు. సిపిఎం గండిపేట మండల కమిటీ ఆధ్వర్యంలో అప్పా చౌరస్తా వద్ద రాస్తారోకో, నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో పొగ బాంబులు వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు హాల్లోకి రావడానికి ఎంట్రీ పాసులు ఇచ్చిన ఎంపీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం గండిపేట మండల నాయకులు డి.ప్రవీణ్‌కుమార్, కె.అనిల్, ఎస్.రమేష్, కె.రాజు, పురుషోత్తంచారి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో బూడిదైన ఇల్లు



మంటలను ఆర్పివేస్తున్న ఫైర్ సిబ్బంది

శంషాబాద్: పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో అగ్నిప్రమాదంలో ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో శ్రీనివాస్, శ్వేత దంపతులు నివాసముంటున్న ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో తగలబడిపోయిన చెత్తకు సబంధించిన మంటలు కాస్తా వారి ఇంట్లోకి వ్యాపించాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మంటలు వ్యాపించిన సంగతిని ప్రారంభంలోనే ఎవరూ గమనించలేదు. స్థానికులు ఫైర్‌స్టేషన్, పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే ఇల్లు దాదాగా పూర్తిగా తగలబడిపోయింది. ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిగా ఆపేశారు. ఇంట్లో లక్షరూపాయల నగదు, కొత్త లాప్‌టాప్‌తో పాటు విలువైనచీరలు ఇతర సామగ్రి పూర్తిగా తగలబడిపోవడంతో బాధితులు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. ఖాళీ స్థలంలో చెత్తకు ఎవరైనా మంటపెట్టారా..? ఎవరైన సిగరేట్, బీడీ తాగిపడేయంతో మంటలంటుకున్నాయా..? అన్నది తెలియలేదు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.